

నేడు చిత్తూరుకు మంత్రి అంబటి రాక

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అంబటి రాంబాబు సోమవారం చిత్తూరు రానున్నట్లు జిల్లా కలెక్టర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెడ్డిగుంటలో నిర్మించిన గ్రౌండ్ వాటర్ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. స్థానిక ఎంఎల్ఏ ఆరణి శ్రీనివాసులు పుట్టినరోజును పురస్కరించుకొని పిసిఆర్‌లో ఏర్పాటు చేయనున్న మెడికల్ క్యాంపును సందర్శించనున్నారు.

రంగు చూసి మోసపోవద్దు

ఆరోగ్యం మరవద్దు..



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

పండ్లల్లో రారాజు మామిడిని చూస్తూనే నోరూరుతుంది. దీనికి తోడు మంచి రంగుతో నిగనిగలాడుతుంటే వీటిని కొనేందుకు వినియోగదారులు ఆసక్తి చూపుతారు. ఈపరిస్థితుల్లో రంగుచూసి కొంటే అనారోగ్యం కొని తెచ్చుకొన్నట్లే అని ఉద్యానవనశాఖ అధికారులు చెబుతున్నారు. వ్యాపారులు మామిడిని మంచి రంగు వచ్చేలా మాగబెట్టేందుకు నిషేధిత రసాయనాలు వినియోగిస్తున్నారని, వీటికి దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. సంప్రదాయ విధానం, శాస్త్రీయ పద్ధతుల్లో ఇథేలియన్ వినియోగించి మాగబెట్టిన పండ్లనే కొనుగోలు చేయాలని లేకుంటే తీవ్రఅనారోగ్య సమస్యలు ఎదుర్కొవాల్సి వస్తుందని ప్రజాఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని కాల్షియం కార్బైడ్ వాడకంపై ప్రత్యేకదృష్టి సారించనున్నట్లు మార్కెటింగ్ కమిటీ అధికారులు చెబుతున్నారు. మార్కెట్ యార్డు ఆవరణంలో ఎక్కడైనా చట్టవ్యతిరేకంగా కాల్షియం కార్బైడ్ ద్వారా మామిడి కాయలను మగ్గబెడుతున్నట్లు తెలిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే చిత్తూరు, బంగారుపాళ్యం, దామల చెరువు మామిడి మార్కెట్ యార్డులోని మామిడి ట్రెడర్స్‌ను హెచ్చరించడం జరిగిందని ఎట్టి పరిస్థితుల్లో స్థానిక విక్రయించే మామిడితో పాటు ఎగుమతి చేసే మామిడిలో కాల్షియం కార్బైడ్ వాడకంపై మార్కెటింగ్‌శాఖ నిబంధనలు కఠినతరం చేసి ప్రజాఆరోగ్యాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

సాంప్రదాయ పద్ధతులే మేలు...

మామిడి కాయలను మాగబెట్టేందుకు శాస్త్రీయ విధానమే మంచిది. ఒక గదిలో 300 కాయలు పెట్టి మిగిలిన ప్రాంతాల్లో గాలి వెళ్లేందుకు అవకాశం కల్పించి మాగపెట్టడం శ్రేయస్కరం. దానితో పాటు శాస్త్రీయ పద్ధతిలో వినియోగించి పెట్టేందుకు అనుమతులు ఇచ్చారు. దీని కోసం చిత్తూరు, దామలచెరువు, బంగారుపాళ్యం ఇతర ప్రాంతాల్లోని మార్కెట్‌యార్డులో రైతులు, వ్యాపారులు శాస్త్రీయ పద్ధతుల్లో నిబంధనలకు అనుగుణంగా మామిడి కాయలను ఉచితంగా మాగబెట్టేందుకు మార్కెటింగ్‌శాఖ అనుమతులు ఇచ్చింది. వీటిని రైతులకు ఉచితంగా వినియోగించుకునే అవకాశం కల్పించారు. నాలుగు వందల మైక్రాన్ల మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లను పైపులను ఉపయోగించి క్యూబ్ తయారు చేసుకొని వాటిలో ఇథిలీన్ పంపి మామిడికాయలు మాగ పెట్టడం కాస్త మంచిది.

అవయవాలపై ప్రభావం...

మామిడి పండ్లను మాగపెట్టేందుకు వ్యాపారులు రైతులు కాల్షియం కార్బైడ్ వాడితే దాని నుంచి వెలువడే ఎసిటిలిన్ అనే వాయువు కలిగి ఉండటం వల్ల ఈ పండ్లు తినడానికి క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఎసిటిలీన్ వాయువు మనిషి నాడీ వ్యవస్థ ఇతర అవయవాలపై ప్రభావం చూపి తలనొప్పి, దీర్ఘకాలిక జ్ఞాపక శక్తిని కోల్పోవడం తదితర ఆరోగ్య సమస్యలకు గురి కావాల్సి వస్తుందని చెబుతున్నారు. ప్రభుత్వం నిషేధించింది. ఈ విధానానికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకొనే అవకాశం రెవెన్యూ, ఉధాన్యవనశాఖకు చట్టపరంగా అధికారాలున్నాయి.

నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు..

మామిడిని మాగపెట్టడంలో నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని ఇప్పటికే రైతులకు, వ్యాపారులకు తెలియజేశాం. తొటబడి కార్యక్రమంలో మామిడి రైతులకు కాయాలను మాగబెట్టే విధానంపై అవగాహన కల్పించాం. కాల్షియం కార్బైడ్ వినియోగిస్తున్న వారిపై చర్యలు తీసుకుటాం. వినియోగదారులు ఈ విషయాలు గమనించి కొనుగోలు చేయాలని కోరుతున్నాం.

- పరమేశ్వర్, ఏడీ, మార్కెటింగ్‌శాఖ

టన్ను రూ.19 వేలు

సూచనలు పాటిస్తే మామిడి రైతులకు ప్రయోజనం

ఇంటర్వ్యూ



మధుసూదన్‌రెడ్డి, జిల్లా ఉద్యానవనశాఖ ఏడీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మామిడి సీజన్ ప్రారంభమైంది. మార్కెట్ యార్డులకు మామిడి కాయలొస్తున్నాయి. ఈ ఏడాది దిగుబడి 20శాతం మాత్రమే. మామిడి రైతులు ఉద్యానశాఖ సూచనల మేరకు కొన్ని జాగ్రత్తలు పాటిస్తే మంచిధరతో ప్రయోజనం పొందే అవకాశం ఉంది. మామిడి రైతులకు రైతుభరోసా కేంద్రాల్లో ఉన్న ఉద్యానశాఖ సిబ్బంది సలహాలు సూచనలు ఇచ్చేలా ఆదేశాలు జారీచేయడం జరిగింది. మార్కెటింగ్ కూడా సహకరిస్తున్నారు. ఒక్కేసారి పంటను కోకుండా దశలవారీగా అంటే మూడు దశల్లో పక్వానికి వచ్చిన కాయలను కోయాలని జిల్లాలోని మామిడి రైతులకు సూచించడం జరిగింది ఉద్యానవనశాఖ ఏడి మధుసూదన్ రెడ్డి తెలిపారు. ప్రజాశక్తి ప్రత్యేక ఇంటర్వ్యూలో ఈసీజన్ మామిడి దిగుబడి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై వివరించారు.

ప్రజాశక్తి: ఈ ఏడాది జిల్లాలో మామిడి దిగుబడి ఎంత?

ఏడీ: జిల్లాలో 68వేల మంది రైతులు 54,370హెక్టార్లలో మామిడి సాగు చేస్తున్నారు. ఈఏడాది సీజన్‌లో దిగుబడి 20శాతంగా ఉంది. దిగుబడి తక్కువ కావడంతో రైతులకు మంచిధర వచ్చే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నాం. ప్రధానంగా జిల్లాలో తోతాపురి రకం అధికం. ఈరకాన్ని గుజ్జు పరిశ్రమలకు అమ్ముకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో తోతాపురి రకం 73,521 హెక్టార్లలో 39,2,271 టన్నులు దిగుబడి వచ్చే అవకాశమున్నట్లు ఉద్యానవనశాఖ అంచనా వేస్తోంది.

ప్రజాశక్తి: మామిడి ధర టన్నుకు ఎంత ఎలా నిర్ణయించారు?

ఏడీ: పంట దిగుబడిని అంచనా వేసుకొని జిల్లాలోని పండ్లు గుజ్జు పరిశ్రమల యజమానులతో సంప్రదించి జిల్లా కలెక్టర్ సమక్షంలో రైతులు, గుజ్జు పరిశ్రమల యజమాన్యాలతో చర్చించి ఈనెల 10 నుండి 20వ తేదీ వరకు తోతాపురి రకం టన్నుకు రూ.19 వేలుగా నిర్ణయించడం జరిగింది. 20వ తేది తరువాత సమీక్షించుకొని అప్పటి పరిస్థితిని బట్టి ధరను నిర్ణయించడం జరుగుతుంది. ఇలా ప్రతి పది రోజుకు ఒకసారి ధరను నిర్ణయిచడం జరుగుతోంది.

ప్రజాశక్తి: జిల్లావ్యాప్తంగా ఎన్ని పండ్ల గుజ్జు పరిశ్రమలు ఉన్నాయి?

ఏడీ: జిల్లా వ్యాప్తంగా అంటే ఉమ్మడి జిల్లాలో 39 ఉన్నాయి. అధికంగా చిత్తూరు జిల్లాలో 31పండ్ల గుజ్జు పరిశ్రమలున్నాయి. పండ్ల గుజ్జు పరిశ్రమలు మామిడి సీజన్ ఆధారంగా నడుస్తున్నాయి. రైతులకు మద్దతు ధరతో పాటు పండ్ల గుజ్జు పరిశ్రమలను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉంది. జిల్లాలో సాగు చేస్తున్న మామిడి ఇతర రాష్ట్రాలకు తరలిపోకుండా మన జిల్లాలోని పరిశ్రమలు అమ్ముకోవాలని రైతులను కోరడం జరిగింది. ఆమేరకు పరిశ్రమల యజమాన్యం కూడా జిల్లాలోని మామిడి రైతులకు మంచి ధర ఇవ్వాలని కోరాం.

ప్రజాశక్తి: మామిడి రైతులకు ఉద్యానశాఖ నుంచి ప్రధాన సూచనలు ఏమిటి?

ఏడీ: మామిడి రైతులు ఒకేసారి పంటను కోయకుండా పక్వానికి వచ్చిన కాయలను మాత్రమే జాగ్రత్తలు ఉద్యానశాఖ సిబ్బంది సూచన మేరకు కోయడం వల్ల కాయలు దెబ్బతినకుండా మార్కెటింగ్‌కు అనువుగా ఉంటాయి. మూడు దఫాలుగా కాయలను పక్వానికి వచ్చినవి మాత్రమే కోయాలని సూచించడం జరుగుతోంది. సీజన్ చివర్లో కోసే కాయలకు మంచి ధర వచ్చే అవకాశముంది. ఎప్పటికప్పుడు పక్వానికి వచ్చిన కాయలను కోయడం ద్వారా చెట్లు బలహీన పడకుండా కోత తర్వాత వెంటనే తేరుకొని తర్వాతి సంవత్సరం దిగుబడికి సిద్ధం అవుతాయి. చెట్లు దెబ్బతినవు, దిగుబడి తగ్గిన సమయాల్లో ఇలాంటి జాగ్రత్త పాటించడం మంచిది.

ప్రజాశక్తి: తూకాల్లో తేడాలను ఎలా అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు?

ఏడీ: ప్రతిసారి గుజ్జు పరిశ్రమల యజమానులు తూకాల్లో తేడాలు చూపుతూ రైతులను దోచుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. దీన్ని అరికట్టేందుకు ఈ ఏడాది ర్యాంపుల వద్ద తూకంలో అవకతవకలను అరికట్టేందుకు 24గంటలు సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నాం. ర్యాంపుల వద్దకు వస్తున్న కాయలు, తూకం వంటి అంశాలు పర్యవేక్షిస్తారు. రైతులకు ఎలాంటి అనుమానం ఉన్నా ర్యాంపుల సిబ్బందికి పిర్యాదు చేయవచ్చు.

ప్రజాశక్తి: కాల్షియం కార్బడ్ వాడకంపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఏడీ: ఇప్పటికే జిల్లా కలెక్టర్ కాల్షియం కార్బడ్ వాడకంపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగింది. ప్రజా ఆరోగ్యానికి హాని కలిగించే కాల్షియం కార్బైడ్ వాడకం నిషేధం. రైతులు, వ్యాపారులు, ఎగుమతిదారులు ఎవ్వరూ కాల్షియం కార్బడ్ ఉపయోగించరాదు. నిబంధనలు అతిక్రమించి కాల్షియం కార్బైడ్‌ను ఉపయోగించి మామిడి కాయలను పండు భారించేందుకు ఉపయోగిస్తే చట్టరిత్యా మూడు సంవత్సరాలు జైలుశిక్ష, రూ.1000ల జరిమాన విధించడం జరుగుతుంది. కాల్షియం కార్బైడ్ వాడి మగ్గబెట్టిన పండ్లును రవాణా చేస్తున్నట్లు గుర్తిస్తే వాహనాలను కూడా సీజ్ చేస్తాం. ఈ మేరకు మామిడి నిబంధనలపై ఈనెల 11వ తేదీ నుండీ డివిజన్ల వారిగా రైతు భరోసా కేంద్రల్లో సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

ఘనంగా నడివీధి గంగ జాతర ఏర్పాట్లు



అమ్మవారికి దాతలు ఇచ్చిన ఆభరణాలను చూపుతున్న సికె.బాబు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఈనెల 16,17 తేదీల్లో నిర్వహించనున్న చిత్తూరు నడివీధి గంగ జాతర ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. వంశపారంపర్య ధర్మకర్త సికే. బాబు, కైలాసగిరి ఏర్పాట్లును జాతర కమిటీ ఏర్పాట్లను పర్యవేక్షించారు. బజారువీధిలో చలువ పందిళ్ళు వేశారు. భక్తుల కోసం తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు అన్నదాన కార్యక్రమాలు దాతలు ఏర్పాటు చేస్తున్నారు. రెండు రోజుల పాటు చిత్తూరులో నిర్వహించే జాతరకు చిత్తూరు పరిసర గ్రామలతో పాటు ఇతర రాష్ట్రాల నుండీ భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొంటారు. స్థానిక గీతా మందిరంలో ఆదివారం ఈఏడాది అమ్మవారికి దాతలు సమర్పించిన బంగారు, వెండి ఆభరాలను వంశపారంపర్య ధర్మకర్త సీకె.బాబు మీడియా ఎదుట ప్రదర్శించారు.

నేడు నగర పాలక కార్యాలయంలో 'స్పందన'

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగరవాసుల సమస్యల పరిష్కారం కోసం చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమవారం 'స్పందన' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ జె.అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక ఆవరణలో సోమవారం (15.5.2023) ఉదయం 10.30 గంటల నుంచి స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించడం జరుగుతుందని అన్నారు. ఈకార్యక్రమానికి హాజరయ్యే వారు మాస్కులు ధరించి, కోవిడ్-19 నిబంధనలను పాటించాలని కోరారు. స్పందన కార్యక్రమానికి నగరపాలక శాఖాధిపతులు హాజరు కావాలన్నారు. అన్ని వార్డు సచివాలయల్లోనూ సాయంత్రం 3 నుంచి 5 గంటల మధ్య స్పందన కార్యక్రమం జరుగుతుందని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీటితో పాటుగా నగరపాలక సంస్థ కాల్‌సెంటర్ నెంబర్ 08572 232745, వాట్సప్ నంబర్ 98499 07885 ఫిర్యాదులు చేయవచ్చని చెప్పారు.

గంగమ్మకు సారె ఇవ్వడం నా అదృష్టం

మంత్రి ఆర్‌కె. రోజా

ప్రజాశక్తి- తిరుపతి టౌన్ :

రాష్ట్ర మంత్రి ఆర్‌కె.రోజా, సెల్వమణి దంపతులు తమ కుటుంబసభ్యులతో కలిసి, ఊరేగింపుగా విచ్చేసి గంగమ్మ తల్లికి సారె సమర్పించారు. తిరుపతి శ్రీతాతయ్య గుంట గంగమ్మ జాతర సందర్భంగా ఆదివారం ఉదయం అమ్మవారికి సారె సమర్పించి తమ భక్తిప్రపత్తులు చాటుకున్నారు. తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు వారికి పూర్ణకుంభ స్వాగతం పలికి, అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేపట్టారు. అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. మీడియాతో మంత్రి రోజా మాట్లాడుతూ గంగమ్మ తల్లికి మా కుటుంబ సభ్యులతో కలసి సారె సమర్పించడాన్ని అదష్టంగా భావిస్తున్నానని అన్నారు. ఇక్కడే పుట్టి ఇక్కడే పెరిగిన నేను, తిరుపతి గంగమ్మ తల్లిని స్కూల్‌డేస్ నుంచి దర్శించుకుంటూనే ఉన్నానని అన్నారు. అప్పటికీ ఇప్పటికీ ఆలయం ఎంతో అభివద్ధి చెందిందని, ముఖ్యంగా మా గురువుగారైన భూమన కరుణాకర రెడ్డి బ్రహ్మాండంగా అభివద్ధి చేశారని కొనియాడారు. ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని, అమ్మవారి మొక్కులు తీర్చుకుని, వారిజీతాల్లో సంతోషాన్ని నింపుకునేలా ఆలయాన్ని తీర్చిదిద్దారని అన్నారు. తిరుపతి శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రత్యేక కతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు. కార్యక్రమాల్లో నగర మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్, ఆలయ కమిటీ చైర్మన్ కట్టా గోపీ యాదవ్, ఈవో మునికష్ణ పాల్గొన్నారు.

దేశ చరిత్రను


శాస్త్రీయ దృక్పథంతో అర్థం చేసుకోవాలి

కొప్పర్తి వెంకట రమణమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ప్రజాశక్తి- తిరుపతిటౌన్: దేశ చరిత్రను మాతృత్వభావనతో విద్వేష ఆలోచనతో అవగాహన చేసుకోవడం సరికాదని, శాస్త్రీయ దక్పథంతో అర్థం చేసుకోవాలని ప్రముఖ చరిత్రకారులు డాక్టర్ కొప్పర్తి వెంకట రమణమూర్తి తెలిపారు. ఉపాధ్యాయ సంఘనాయకుడు, అమరజీవి దాచూరి రామిరెడ్డి 7వ స్మారక ఉపన్యాసం యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఎస్వి మెడికల్ కాలేజీ, భువన విజయం ఆడిటోరియంలో జరిగినది. ఈసభకు యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా భారత దేశచరిత్ర - లౌకిక దక్పథం అనే విషయంపై కొప్పర్తి మాట్లాడారు. మతాన్ని రాజకీయ ప్రయోజనం కోసం వాడాలని చూసే మతతత్వ భావనను ఈదేశ ప్రజలు వ్యతిరేకించాలని తెలిపారు. మతతత్వాన్ని వ్యతిరేకించే వారిని మతాన్ని వ్యతిరేకించే వారిగా చిత్రీకరించే తప్పుడు ప్రచారాన్ని అర్థం చేసుకోవాలని కోరారు. మధ్య యుగాల చరిత్ర విధ్వంస చరిత్ర కాదని, దేశ సాంస్కతిక సమైక్యత జరిగిన కాలమని సోదాహణంగా వివరించారు. హస్తకళా నైపుణ్యం అభివద్ధి చెందిన కాలాన్ని విధ్వంసం కాలం అని ఎలా అనగలమని ప్రశ్నించారు. బ్రిటీష్‌వారు తప్ప మరెవరు విదేశీయులు దేశంలో లేరని శాస్త్రీయ చరిత్ర ఆధారాలతో సహ నిరూపించబడిందని తెలిపారు. వాస్తవ చరిత్రను ఉపాధ్యాయులు అధ్యయనం చేయాలని వైవిధ్యం ఉన్న సమాజంలో ఒకేరకంగా ఉండాలని కోరడం సరికాదని, వాస్తవాలు పవిత్రమైనవని వాటిని కాపాడుకోవాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమాన్ని, సంఘాన్ని నిర్మించిన మహోన్నత వ్యక్తి దాచూరి రామిరెడ్డి అని తెలిపారు. ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ప్రభుత్వ విద్యారంగ వికాసం కోసం తన జీవితాన్ని మొత్తం త్యాగం చేసిన రామిరెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. రామిరెడ్డి ముందుచూపు ఉన్న దార్శినికుడని తెలిపారు. ఉపాధ్యాయ సమస్యల పోరాటంతో పాటు, బాధ్యతల విషయంలో నిక్కచ్చిగా ఉండే వారిని తెలిపారు. ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణ్ రావు మాట్లాడుతూ ఎన్‌సిఇఆర్‌టి ముద్రించిన పుస్తకాలలో మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ చరిత్రను, జమ్మూ కాశ్మీర్‌లో ఉన్న 370 ఆర్టికల్ అంశాల చరిత్ర పాఠ్యాంశాన్ని, మహాత్మా గాంధీ హత్య అంశాన్ని తొలగించడం వాస్తవ చరిత్రను పక్కన పడేయడమేనని విమర్శించారు. గాంధీని హత్య చేసిన గాడ్సే పాఠ్యాంశాన్ని గుజరాత్ అల్లర్లలో చనిపోయిన వారి గురించిన చరిత్రను తొలగించడం ద్వారా సైన్స్‌పై దాడి చేసే భావజాలంను ముందుకు తీసుకురావడానికి చేసే ప్రయత్నం అని విమర్శించారు. వాస్తవచరిత్రను విద్యార్థులకు బోధించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్, రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు, సహాధ్యక్షులు ఏఎన్.కుసుమ కుమారి, రాష్ట్ర కార్యదర్శులు ఎస్ఎస్.నాయుడు, టి.రఘుపతి రెడ్డి, ఎన్.నవకోటేశ్వర రావు, రాష్ట్ర కార్యదర్శి సభ్యులు బి.శ్రీదేవి, చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు రాజశేఖర్, ముత్యాల రెడ్డి, సోమశేఖర్ నాయుడు, జివి.రమణ, వివి.శేషులు, చలపతి శర్మ, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



గ్రూప్-2 నోటిఫికేషన్ విడుదల చేయండి

అవగాహన సదస్సులో లక్ష్మణరావు డిమాండ్



ప్రజాశక్తి-తిరుపతి టౌన్: గ్రూప్-2 అవగాహన సదస్సు ఆదివారం తిరుపతిలో భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) శ్రీవిద్య ఐఏఎస్ అకాడమీ సంయుక్తంగా సదస్సు నిర్వహించడం జరిగింది. ఈసదస్సులో పోటీ పరీక్ష నిపుణులు కష్ణ గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు, డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.జయచంద్ర, బాబు డైరెక్టర్ సిద్ధయ్య హాజరైనారు. ఆంధ్రుల చరిత్ర అనే పుస్తకాన్ని విడుదల చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత కొన్ని రోజుల నుంచి నోటిఫికేషన్ ఇవ్వకుండా అభ్యర్థులను ఇబ్బందులు గురిచేస్తుందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1500 పోస్టులు ఖాళీగా ఉన్నాయని అన్నారు. దాదాపు 5లక్షల మంది పైచిలుకు నోటిఫికేషన్ కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం బాధాకరమని అన్నారు. పోటీపరీక్షలకు ఎలా ప్రిపేర్ కావాలి అనే అంశాన్ని అభ్యర్థులకు బోధించడం జరిగింది. అనంతరం అభ్యర్థులందరికీ ఉచితంగా మెటీరియల్ పంపిణీ చేయడం జరిగింది. కార్యక్రమంలో విశ్వనాథ్, అజయ్ కుమార్, వినోద్ అభ్యర్థులు పాల్గొన్నారు.

తిరుమలలో ఉరి వేసుకుని

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



ప్రజాశక్తి- తిరుమల: తిరుమలలో ఉరివేసుకొని గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. తిరుమల పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తిరుమల నుంచి తిరుపతికి వెళ్ళే రోడ్డు మార్గంలో జిఎన్‌సి అటవీ ప్రాంతానికి అతి సమీపాన మతుడు తాడు సహాయంతో చెట్టుకు కట్టుకొని ఉరివేసుకొని మరణించారు. వాహనచోదకుల ద్వారా సమాచారం అందుకున్న విజిలెన్స్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని తిరుమల ఆశ్విని ఆస్పత్రికి తరలించారు. మతదేహం వద్ద ఎలాంటి చిరునామా లేకపోవడంతో తిరుమల పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.


ఘాట్ రోడ్డులో ప్రమాదం

ఇద్దరు మహిళలు మృతి

ప్రజాశక్తి- తిరుమల: తిరుమలలో మొదటిఘాట్ రోడ్డులో జరిగిన ప్రమాదం ఇద్దరి కుటుంబాల్లో విషాదం నెలకొల్పింది. అనంతపురం జిల్లా రాయదుర్గంకు చెందిన భక్తులు శ్రీవారి దర్శనం ముగించుకొని తిరుగు ప్రయాణం అయ్యారు. తిరుమల నుంచి తిరుపతికి వెళ్ళే రోడ్డు మార్గంలో 24వ మలుపు వద్ద సుమో వాహనం టైర్ పంక్చర్ అవ్వడంతో వాహాహాన్ని భక్తులు రోడ్డుకు పక్కన పెట్టుకున్నారు. అందులో ఉన్న రేణుకమ్మ (24)అనే మహిళ 24వ మలుపు వద్ద డివైడరుకు ఉన్న ఆంజనేయస్వామి విగ్రహానికి పూజలు నిర్వహిస్తుండగా వెనుక నుంచి వస్తోన్న తుపాన్ వాహానానికి బ్రేకులు పడకపోవడంతో రేణుకమ్మను డీకొట్టి బోల్తాపడింది. ఈప్రమాదంలో రాయదుర్గంకు చెందిన రేణుకమ్మ అక్కడక్కడే మతిచెందగా తుపాన్ వాహనంలోని మెదక్‌కు చెందిన పార్వతమ్మ కూడా మతిచెందింది. ఈ ప్రమాదంలో తుపాన్ వాహనంలో పలువురికి గాయాలు కావడంతో ఘాట్ రోడ్డు సిబ్బంది అంబులెన్స్ ద్వారా తిరుపతికి రుయా ఆస్పత్రికి తరలించారు.




ఘనంగా అమ్మల దినోత్సవం




ప్రజాశక్తి-పలమనేరు: పట్టణంలోని సాయి గార్డెన్ సిటీ, కళామందిరంలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్ష, కార్యదర్శులు తులసీ నాదం నాయుడు, పుష్పల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా విభిన్న రంగాలలోని తల్లులను వారి పిల్లలతో దుశ్శాలువాలు కప్పి సన్మానించి, పూలమాలలు వేసి పాదపూజ చేయించారు. ఈ సందర్భంగా తల్లులు మాట్లా డుతూ గత 15 రోజుల నుంచి తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో వేసవి సెలవుల నేపథ్యంలో ఎటువంటి లాభాపేక్ష లేకుండా పిల్లలకు వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహిస్తున్నారని, పిల్లలపై వీరికి ఉన్నటు వంటి మమకారానికి ఎంతో అబ్బుర పడ్డామన్నారు. విచ్చేసిన పిల్లలతో మాతృదినోత్సవ పాటలు పాడించారు. తదుపరి విభిన్న రంగాల ప్రముఖులు మాతృ దినోత్సవ గొప్పదనాన్ని వ్యక్త పరిచారు. తులసీనాదం నాయుడు మాట్లాడుతూ నేటి తరం పిల్లలు తమ అమ్మలను మమ్మీ మమ్మీ అని పిలుస్తున్నారని, పిల్లలందరూ స్వచ్ఛంగా అమ్మ అని పిలవాలన్నారు. తల్లి దండ్రులు పిల్లలను రెసిడెన్షియల్ స్కూల్స్‌లో ఉంచి చదివిస్తున్నారని వారు పెరిగి పెద్ద వారై తమ తల్లి దండ్రులను ఓల్డేజ్ హోంలో చేర్పిస్తారన్నారు. కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లలను విలువలతో కూడిన మంచి పద్ధతులు నేర్పిస్తూ పెంచాలన్నారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, శ్రీపురం సీతారామయ్య, వై.నరేంద్ర, మురళి మోహన్ రెడ్డి, శివశంకర్ రెడ్డి, మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం



ప్రజాశక్తి-వెదురుకుప్పం: ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు ఓ వరమని ఉప ముఖ్యమంత్రి కె నారాయణస్వామి ఆదివారం తెలిపారు. మండలంలోని పచ్చికాపల్లం దాసరి కాలనీకి చెందిన లోకనాథం కుమారుడు రాజేష్‌కి ఇటీవల అనారోగ్య కారణంగా వేలూరు సీఎంసీ హాస్పిటల్‌లో కిడ్నీ ఆపరేషన్ జరిగింది. ఆపరేషన్‌కు సుమారు రూ.10 లక్షలు పైగా ఖర్చు అయినట్లు బాధితులు ఉప ముఖ్యమంత్రికి తెలియజేశారు. వెంటనే స్పందించిన ఉప ముఖ్యమంత్రి బాధితుల దగ్గర నుంచి బిల్స్ సేకరించి ముఖ్యమంత్రి సహాయ నిధులతో రాజేష్‌కి రూ.4 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో వెదురుకుప్పం జడ్పిటిసి సభ్యులు చలం పాలెం సుకుమార్, మాంబేడు మాజీ ఎంపిటిసి సభ్యులు బండి రోసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'టిడిపి అభ్యర్థి విజయానికి కృషి చేయాలి'



ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో రానున్న శాసనసభ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి విజయానికి సమిష్టిగా పని చేయాలని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్తూరు పార్లమెంట్ టిడిపి కార్యనిర్వహణ కార్యదర్శి ఎర్రగుంట్ల కృష్ణమనాయుడుని కోరారు. శనివారం హైదరాబాదులో కృష్ణమ నాయుడు చంద్రబాబు నాయుడుని కలిసిన సందర్భంలో తనతో చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ రానున్న శాసనసభ ఎన్నికల్లో నాయకులందరూ పార్టీ నిర్ణయించిన అభ్యర్థి విజయానికి సమిష్టిగా కషి చేయడానికి మరిన్ని చర్యలు తీసుకోవాలని తనను కోరారు అన్నారు. రాష్ట్రంలో ప్రజలు వైసీపీ పాలనపై విసిగి వేసారి ఉన్నారని, రాష్ట్రవ్యాప్తంగా అత్యధిక సీట్లు సంపాదించి మరో మారు టిడిపి జెండా ఎగురవేయడం ఖాయమని, ఇలాంటి పరిస్థితుల్లో గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో సైతం టిడిపి అభ్యర్థి విజయం సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ పరిధి లోని కార్యకర్తలను సన్నద్ధం చేయాలని అన్నారని కృష్ణం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు .

ఆకట్టుకుంటున్న వేసవి విజ్ఞాన శిబిరం



ప్రజాశక్తి-వి.కోట: మండల పరిధిలోని విద్యార్థులకు వి.కోట శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం ఎంతగానో ఆకట్టుకుంటుంది. ప్రభుత్వం పాఠశాలకు వేసవి సెలవులు ప్రకటించిన నేపథ్యంలో గ్రంథాలయశాఖ వారు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తూ పిల్లలకు వినోదంతో కూడిన విజ్ఞాన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. వేసవి సెలవుల్లో పిల్లలకు సమయాన్ని సద్వినియోగం చేసుకునేలా వినోద గణితం, కథలు వినుట, చెప్పుట, పుస్తక పఠనం, చిత్రలేఖనం, సంగీతం, పేపర్ ఆర్ట్ వంటి సజనాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



ప్రజాశక్తి-పాలసముద్రం: మండలంలోని బల్లిగంటగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989-90 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల కలయిక కన్నుల పండుగ జరిగింది. దాదాపు 34 సంవత్సరాల తరువాత ప్రైవేటు, ప్రభుత్వ రంగాల్లో స్థిరపడిన స్నేహితులు, తమకు విద్యను బోధించిన గురువులను, నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పట్లో విద్యను నేర్పించిన గురువులు మార్కొండ నాయుడు, గోవిందప్ప నాయుడు పాదాలకు పూజలు చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. పూర్వ విద్యార్థులు వారి కుటుంబ వివరాలను, ప్రస్తుతం వారు చేస్తున్న పనులు ప్రతి ఒక్కరూ వేదికపై వచ్చి చెప్పారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మార్కొండ నాయుడు మాట్లాడుతూ తమ వద్ద విద్యను అభ్యసించిన 34 ఏళ్ల తర్వాత విద్యార్థులు కలగడం చాలా ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగడంతోపాటు సమాజసేవ చేసినప్పుడే గురువులకు చాలా సంతోషంగా ఉంటుందన్నారు. పూర్వ విద్యార్థి ధనరాజు మాట్లాడుతూ అప్పట్లో ఉపాధ్యాయులంటే భయపడి చదువులు నేర్చుకుని ఇప్పుడు ఈ స్థాయిలో ఉన్నామని తెలిపారు. చదువులో విద్యతో పాటు క్రమశిక్షణపై మాకు బోధించిన గురువులు చెప్పినట్లే ఇప్పుడు కూడా నడుచుకుంటామని వివరించారు. తమకు విద్యను నేర్పించిన ఉపాధ్యాయుడు, పూర్వ విద్యార్థులు 5 మంది మతి చెందారని, వారికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం గురువులకు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు.

మాజీ శాసనసభ్యులకు సత్కారం



ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు నియోజకవర్గం ఆంజనేయులకు రసజ్ఞుల సమాఖ్య, తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి సంయుక్తంగా వర్రా చెన్నారెడ్డి పురస్కారాన్ని కళామందిరంలో ఆదివారం అందించారు. ఆంజనేయులు శాసనసభ్యునిగా తక్కువ కాలం ఉన్నా విలువలతో పని చేశారని కొనియాడారు. అనంతరం పలమనేరు రిక్రియేషన్ క్లబ్ ప్రతినిధులు ఆంజనేయులు దంపతులను ఘనంగా సత్కరించారు. పురస్కారాన్ని అందించిన వారిలో సంస్థల నిర్వాహకులు శ్రీపురం సీతారామయ్య, వై నరేంద్ర, పి తులసి నాథం నాయుడు, పుష్ప, చంద్రశేఖరయ్య, గిరిధర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి అవినీతిపై మాట్లాడితే అట్రాసిటీ కేసులా?



ప్రజాశక్తి-పుంగనూరు: జిల్లాలో పర్యావరణ అనుమతులు, అవకతవకలపై ఎన్జీటీ మూడు ప్రాజెక్టు పనులను తక్షణమే ఆపేయాలని తీర్పు ఇచ్చిన మంత్రి పెద్దిరెడ్డికి అవేమి పట్టనట్లు పనులు చేస్తున్నారని విమర్శించినందుకే మాపై అట్రాసిటీ కేసులు నమోదు చేశారని ప్రముఖ వ్యాపారవేత్త రామచంద్ర యాదవ్ తెలిపారు. స్థానిక ఎల్ఐసి కాలనీలోని సునంద నిలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పుంగనూరు నియోజకవర్గంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేపట్టిన రిజర్వాయర్లు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ రూ.100 కోట్లు జరిమానా విధించిందని, పనులు తక్షణమే ఆపేయాలని చెప్పినా నిలుపకుండా పనులు చేపట్టిన రిజర్వాయర్లను శుక్రవారం పరిశీలించినట్లు ఆయన తెలిపారు. మేము వెళ్లి వచ్చిన తర్వాత మాపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టడం జరిగిందని ఈ నియోజకవర్గంలో మంత్రి పెద్దిరెడ్డిని ఎదిరిస్తే కేసులు పెట్టడం జైలుకు పంపడం షరా మామూలుగా జరుగుతుందన్నారు. నేతిగుట్లపల్లి ప్రాజెక్టు వద్ద రైతులకు చెల్లించవలసిన పరిహారాన్ని ఇప్పటివరకు చెల్లించకపోవడం పెద్దిరెడ్డి మోసానికి ఇది నిదర్శనం అన్నారు. రాష్ట్రంలో ఒక్క పుంగనూరు నియోజకవర్గంలోనే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు అధికంగా నమోదయ్యాయని మొదటి స్థానంలో నిలుస్తుందని అన్నారు. దీనిని బట్టి చూస్తే పెద్దిరెడ్డి అరాచకత్వం అర్థమవుతుందన్నారు. గత నాలుగేళ్లలో చట్టాన్ని పూర్తిగా దుర్వినియోగం చేస్తున్నది పెద్ద రామచంద్రారెడ్డి అని అన్నారు. ప్రజల సొమ్ము దుర్వినియోగం చేసినవి కట్టించుకునే రోజులు దగ్గర పడ్డాయి అన్నారు. సమావేశంలో చనకంటి సాంబమూర్తి, రామచంద్ర యాదవ్ యువసేన నాయకులు పాల్గొన్నారు.

'తోతాపురికి కనీస ధర రూ.35 ప్రకటించాలి'

ప్రజాశక్తి-పుంగనూరు: రాష్ట్ర ప్రభుత్వం చిత్తూరు జిల్లా మామిడి రైతులను ఆదుకునేందుకు తోతాపురికి కనీస మద్దతు ధర కిలోకి రూ.35 చొప్పున చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు, మామిడి ఉత్పత్తిదారుల సంఘం గౌరవ అధ్యక్షులు టి.జనార్ధన్ డిమాండ్ చేశారు. ఆదివారం పుంగనూరు పట్టణంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ గత సంవత్సరం పల్ప్ ఫ్యాక్టరీ యజమానులు తోతాపురి కిలో మామిడికి రూ.67కు రైతుల నుంచి కొనుగోలు చేసిన విషయం గుర్తుంచుకోవాలన్నారు. మామిడి సాగుకు మందులు కొట్టడానికి ఎకరాకు రూ.లక్ష పైగా ఖర్చు అవుతుందని, అలాగే ఈ దఫా 50 శాతంగా పంట చేతికి వచ్చేటువంటి పరిస్థితి ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో మామిడి రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికారులు గుజ్జు యజమానులతో మరోసారి సంప్రదించి గిట్టుబాటు ధర కనీసం రూ.35 చెల్లించేలా చూడాలని పేర్కొన్నారు. లేనిచో రైతాంగం తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందని అన్నారు. ఇప్పటికే మామిడికి గిట్టుబాటు లేక రైతులు మామిడి పంటపై విరక్తి చూపుతూ ఇతర పంటలవైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. మామిడి రైతుల్ని ఆదుకోకపోతే భవిష్యత్తులో పంట విస్తీర్ణం తగ్గి దేశానికి సైతం విదేశీ మారక ద్రవ్యం తగ్గిపోవడం జరుగుతుందని పేర్కొన్నారు. మామిడిని వాణిజ్య పంటగా పేర్కొని ధరలు నిలకడగా ఉండేట్టుగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, జిల్లాకు మామిడి బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో భవిష్యత్తులో రైతాంగ ఉద్యమాల్ని చవిచూడాల్సి వస్తుందని ఈ సందర్భంగా హెచ్చరించారు.

అభివృద్ధి పట్టించుకోని పాలకులు




ప్రజాశక్తి-గంగవరం: మండలంలోని కలగటూరు పంచాయతీ మండలంలో మూడవ అతిపెద్ద పంచాయతి. అయితే దశాబ్దాలు గడిచినా ఎలాంటి అభివద్ధి కార్యక్రమాలు జరగకపోవడంతో, గ్రామంలోని యువకులు ఒక్కటిగా మన గ్రామాన్ని మనమే అభివద్ధి చేసుకుందాం అన్న నినాదంతో ముందుకొచ్చి తలా కొంత నగదు జమ చేసి నడివీధి రోడ్డును వారే నిర్మించుకోవడానికి ముందుకు వచ్చారు. ఈ గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు పాత బిల్డింగుల్లోనే సాగడం గమనార్హం. ఈ నడివీధిలో వర్షాకాల సమయంలో సిసి రోడ్డు లేకపోవడంతో బురదమయమై వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. డ్రైనేజీ కాలువ లేకపోవడంతో మురుగు నీరంతా రోడ్డుపై నిలిచి దోమలకు నిలయాలై దుర్వాసనలు వెదజల్లేవని, ఇలాంటి పరిస్థితులలో ఎవరూ పట్టించుకోకపోవడంతో యువత ముందుకు వచ్చి తామే స్వయాన రోడ్డు నిర్మాణం చేపట్టడం గర్వకారణంగా ఉందని అంటున్నారు. ఈ గ్రామంలో ప్రతిపక్ష పార్టీ సర్పంచి కావడం శాపమని పలువురు అంటున్నారు. చుట్టుపక్కల గ్రామస్తులు వీరిని ఆదర్శంగా తీసుకోవాలని ప్రశంసిస్తున్నారు. యువకులు అనుకుంటే ఏదైనా సాధించవచ్చని స్వచ్ఛందంగా వారి గ్రామానికి కావాల్సిన అన్ని మౌలిక వసతులు కల్పించుకుంటారని అంటున్నారు. ఈ దారి దళితవాడకు వెళ్లే దారి కావడంతో దళితవాడ శాపమా లేక వివక్షత అని కూడా దళితవాడ ప్రజలు అంటున్నారు.

బిఎస్ఎన్ఎల్ వినియోగదారుల ఇక్కట్లు

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సోమలలోని బిఎస్ఎన్ఎల్ చరవాణి సిగ్నల్స్ సక్రమంగా లేకపోవడం, ఫోన్ చేసినా, ఫోన్ రిసీవ్ చేసుకున్నా మాటలు స్పష్టంగా వినిపించకపోవడంతో బిఎస్ఎన్ఎల్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గత మూడు నెలలుగా ఇదే పరిస్థితి ఉన్నా సంబంధిత బిఎస్ఎన్ఎల్ అధికారులు పట్టించుకోకపోవడంతో పలువురు బిఎస్ఎన్ఎల్ వినియోగదారులు చేసేది ఏమీ లేక ఇతర నెట్వర్కులకు తమ నెంబర్‌ను పోర్టల్ చేసుకొని బిఎస్ఎన్ఎల్ వినియోగదారుల సంఖ్య తగ్గే విధంగా అధికారులు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. దాదాపు 40 సంవత్సరాలుగా మండల కేంద్రంలో ఓ ప్రైవేటు ఇంటిలో టెలికాం పరికరాలతో వినియోగదారులకు ల్యాండ్ ఫోన్స్ సౌకర్యం అందిస్తూ వచ్చారు.

ఆ తర్వాత వచ్చిన మార్పులకు అనుగుణంగా బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద సెల్ టవర్ ఏర్పాటు చేసి వినియోగదారులకు బిఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ అందే విధంగా చర్యలు చేపట్టారు. అయితే సిగ్నల్స్ పూర్తి స్థాయిలో సెల్ఫోన్లకు అందకపోవడం అందినా మాటలు స్పష్టత లేకపోవడం నెట్ స్లోగా రావడం జరుగుతోంది. దీనిపై బిఎస్ఎన్ఎల్ అధికారులు దష్టి సారించి వినియోగదారులకు మెరుగైన నెట్వర్క్, సేవలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని బిఎస్ఎన్ఎల్ వినియోగదారులు కోరుతున్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు


గంగాధర నెల్లూరు

ప్రజాశక్తి-సోమల: మండలంలోని పలు హనుమంతుడి ఆలయాలలో ఘనంగా హనుమాన్ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. మండల కేంద్రమైన సోమల సమీపంలోని అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించిన అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయ సమీపంలోని ఆంజనేయ స్వామి, ఎర్ర నాగుల వారి పల్లి గ్రామంలోని హనుమంతుడి ఆలయం, మండలంలోని రామాలయాలలోని ఆంజనేయ స్వామి విగ్రహాలకు ప్రత్యేక అలంకరణలు పూజలు అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం చేశారు. కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొని తమ మొక్కులను చెల్లించుకున్నారు.

బైరెడ్డిపల్లి: హనుమాన్ జయంతి సందర్భంగా బైరెడ్డిపల్లి టు వి.కోట జాతీయ రహదారిలో వెలిసిన శ్రీ ఆంజనేయ స్వామికి ఆదివారం పురోహితులచే అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే మండలంలోని నెల్లిపట్లలో వెలిసిన వ్యాస ప్రతిష్ట శ్రీ హనుమాన్ ఆలయంలో ధర్మవరం కుటుంబీకులచే స్వామివారికి పంచామత అభిషేకాలు చేసి, సుగంధ పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. దేవరాజ్, శేఖర్, సుధాకర్, రాఘవేంద్ర, మోహన్ ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: సంజీవి మూలదారుడు ఆంజనేయస్వామి అని బ్రహ్మానంద ఆశ్రమ గురూజి కేశవానంద స్వామి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని మాధవ నగర్‌లోని బ్రహ్మానంద ఆశ్రమంలో హనుమాన్ జయంతి వేడుకలు జరిగాయి. మొదట హనుమాన్ చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేసి హనుమాన్ చాలీసా హనుమంతుని జన్మ రహస్యం వత్తాంతం పూర్తిగా తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు నరసింహులు నాయుడు, సుబ్రహ్మణ్యం రెడ్డి, సుధాకర్ రెడ్డి, సుబ్రమణ్యం నాయుడు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండల పరిధిలోని గోవిందరెడ్డిపల్లి కొండపై వెలిసిన శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. 18వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలోని శ్రీ వీరాంజనేయ స్వామివారి విగ్రహానికి పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీతారాములకి కల్యాణం నిర్వహించి భక్తులకు మహా నైవేద్యం, మంగళహారతి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


సోమల


బంగారుపాళ్యం

వీధిలైట్ల ఏర్పాటు



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని పాతూరునాత్తం గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు పురవీధులలోని విద్యుత్ స్తంభాల వీధిలైట్లు మరమ్మతులకు గురయ్యాయి. దీన్ని గమనించిన స్థానిక సర్పంచ్ రోజా శివ శంకర్ ప్రజలను దష్టిలో ఉంచుకొని రాత్రిపూట పురవీధులలో చీకటిగా ఉండటంతో ఆయన సొంత ఖర్చులతో ఆదివారం కొత్త ఎల్ఈడీ లైట్లు తెప్పించారు. అనంతరం సర్పంచ్ దగ్గరుండి విద్యుత్ సిబ్బందితో ప్రతి స్తంభానికి బల్బ్ అమర్చేలా చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ ఆచారి, సచివాలయ సిబ్బంది, వార్డ్ వాలంటీర్లు, లైన్ మెన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

హంస వాహనంపై వీణాపాణి



ప్రజాశక్తి-కార్వేటినగరం: స్థానికంగా వెలిసిన శ్రీ వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం చిన్నశేషవాసంపై వేణుగోపాలుడు, రాత్రి హంసవాహనంపై సరస్వతీదేవిగా భక్తులను అనుగ్రహించారు. బ్రహ్మోత్సవాల్లో రెండవ రోజు ఉదయం 7.30 నుంచి 9.30 గంటలకు ఐదు పడగల చిన శేష వాహనంపై శ్రీవేణుగానలోలుడు పురవీధుల్లో విహరించారు. స్వామి వారి వాహనం ముందు చెక్క భజనలు, కోలాటాలు, మేళ తాళాల నడుమ వాహన సేవ వైభవంగా జరిగింది. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు అభిషేకం, శుద్ధి, తోమాల, పంచాంగ శ్రవణం అర్చన జరిపి తొలిగంటలో నైవేద్యం సమర్పించారు. వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామివారి ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ మోహన్, సూపరింటెండెంట్ రమేష్ బాబు, ఆలయ అధికారి సురేష్ కుమార్, కంకణబట్టు గోపాలాచార్యులు, నారాయణ దాసరి, కిరణ్ భట్టాచార్యులు, వరదాచార్యులు, పర్యవేక్షకులు, అర్చకులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులు లైసెన్స్‌లు కలిగి ఉండాలి



ప్రజాశక్తి-పాలసముద్రం: ద్విచక్ర వాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు తప్పకుండా డ్రైవింగ్ లైసెన్స్, రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలని ఎస్ఐ బి సురేష్ తెలిపారు. ఆదివారం బలిజ కండ్రిగ-పల్లిపట్ జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాలను తనిఖీ నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులతో ఎస్సై మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడపడంతో చాలా రోడ్డు ప్రమాదాలు జరిగి చిన్న వయసులోనే మతి చెందుతున్నారన్నారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, రికార్డులు, హెల్మెట్ తప్పక ఉండాలని సూచించారు. రికార్డుల్లేని వాహనాలకు జరిమానా వేశారు.

యోగాతో ఆరోగ్యం



ప్రజాశక్తి-సోమల: విద్యార్థులు, చిన్నారులు యోగా చేయడంతో ఆరోగ్యంగా ఉంటారని, జ్ఞాపకశక్తి పెరిగి పరీక్షలలో బాగా మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించవచ్చునని గ్రంథాలయ అధికారి రామకష్ణ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న రోజుకొక కార్యక్రమం కింద ఆదివారం విద్యార్థులతో యోగా ఎలా చేయాలి, దాని ఉపయోగాలు ఏమిటి అన్న వివరాలతో కూడిన యోగాను ఆయన విద్యార్థులతో చేయించారు. కార్యక్రమంలో చిన్నారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో కూలీ మృతి



ప్రజాశక్తి-సోమల: మండలంలోని ఆవుల పల్లె వద్ద నిర్మిస్తున్న ప్రాజెక్ట్ పనులలో కూలీగా పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చి ఈనెల 12వ తేదీ అదశ్యమై, 13వ తేదీ మృతి చెంది శవం లభ్యమై ఆదివారం పోలీసులకు ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలు.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం దక్షిణ దీనజ్ జిల్లా కస్బార్ గ్రామానికి చెందిన బప్పాదాస్(52), అదే ప్రాంతానికి చెందిన మరి కొంతమందితో కలిసి ప్రాజెక్ట్ పనులలో కూలి పనులు చేసేందుకు రెండు నెలల క్రితం ఆవుల పల్లె ప్రాజెక్టు వద్దకు వచ్చారు. ఈ క్రమంలో ఈనెల 12వ తేదీ బొప్పా దాస్ కనిపించకుండా పోవడంతో పశ్చిమ బెంగాల్ వెళ్లి ఉంటాడని భావించారు. అయితే 13వ తేదీ శనివారం పెద్ద ఉప్పరపల్లి గ్రామానికి చెందిన తాహిద్ ఇబ్రహీం మామిడి తోటలో శవమై కనిపించాడని, అతనితోపాటు కూలి పనులకు వచ్చిన వారికి విషయం తెలపడంతో వారు గుర్తించారని, సంఘటనపై ఫిర్యాదు రావడంతో హెడ్ కానిస్టేబుల్ ముని ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. కాగా బప్పాదాస్ ఆత్మహత్య చేసుకున్నాడా? ఎవరైనా హత్య చేశారా? అన్న దిశగా పోలీసులు దర్యాప్తు చేస్తే మరిన్ని విషయాలు తెలిసే అవకాశం ఉంది.

ముగిసిన మహాభారత ఉత్సవాలు



ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: మండలంలోని కొత్తపల్లి, కొటార్లపల్లి, కొత్తపల్లిమిట్ట, బసివిరెడ్డిపల్లి, కొత్తపల్లి గ్రామంలో వెలిసిన శ్రీ ద్రౌపతి ఆలయ ఆవరణంలో ఆదివారం దుర్యోధన వధ ఘట్టం అలరించింది. మహాభారత ఉత్సవాలలో భాగంగా చివరి రోజైన దుర్యోధన వధ కార్యక్రమం జరిపారు. ఆలయ ఆవరణంలో దుర్యోధుని ప్రతిమను మట్టితో ఏర్పాటు చేయగా భీముడు, దుర్యోధనుడిగా వేషధారణ చేసి పద్యాలు, పాటలు పాడుతూ జనాన్ని ఆకట్టుకున్నారు. మడుగులో దాగిన దుర్యోధనుడిని భీముడు లాగి వధించిన ప్రతిమ చేసిన మట్టిని తీసుకురాడానికి ఎగబడ్డ జనం దీనిని ఇంట్లో దాచుకుంటే ధనరాసులు అవుతారని వారి నమ్మకం. ధర్మరాజుకి పట్టాభిషేకం మహోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం భక్తిశ్రద్ధలతో అగ్నిప్రవేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త నాగరాజు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కనులవిందుగా ద్రౌపదీ కల్యాణం



ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సోమల పంచాయతీ భారతం మిట్టలో గత పది రోజులుగా నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞ కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి నిర్వహించిన ద్రౌపతీ కల్యాణం భక్తులకు కనువిందు చేసింది. పాండవులు, ద్రౌపతి ఉత్సవ విగ్రహాలకు పురోహితులు ప్రత్యేక వేదికపై అలంకరణ చేసి, అనంతరం పూజలు నిర్వహించి వేదమంత్రాల నడుమ కల్యాణోత్సవాన్ని అశేష భక్త జనావళి చూస్తుండగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొని ద్రౌపతి కళ్యాలాన్ని చూసి అనంతరం కర్పూర హారతులను అందజేశారు. ద్రౌపతి కల్యాణానంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

గంగాధర నెల్లూరు: మండలంలోని గరిగెలపల్లె వెంకటాపురం గ్రామం వద్ద ద్రౌపతి కల్యాణ వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. మహాభారతం యజ్ఞం కార్యక్రమంలో భాగంగా ధర్మరాజుల ఆలయంలో 18 గ్రామాలకు చెందిన గ్రామస్తులు ద్రౌపతి కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు జె రాజేంద్రనాయుడు, టి నాగరాజు నాయుడు, పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మండల కేంద్రంలోని ఎన్‌పీ చెంగల్రాయ నాయుడు చిల్డ్రన్స్ పార్కులో ఆయన కుమారుడు చిత్తూరు మాజీ ఎమ్మెల్యే ఎన్‌పీ వెంకటేశ్వర చౌదరి సహకారంతో తిరుపతి శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి వైద్య నిపుణులచే ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి మండలంలోని మారుమూల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు. శిబిరానికి సుమారు 120 మంది హాజరై చికిత్స చేయించుకోగా 20 మందికి కంటి ఆపరేషన్లకు తిరుపతికి తీసుకెళ్లి చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర చౌదరి, మాజీ ఏఎంసీ ఛైర్మన్ జయచంద్ర నాయుడు, జంబు వారి పల్లి మాజీ సర్పంచ్ కమల్‌నాథరెడ్డి, భాను ప్రకాష్, అభి, తిరుపతి శ్రీ అరవింద కంటి వైద్య నిపుణులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



ప్రజాశక్తి-గంగవరం: మండల పరిధిలోని ఏడూరు గ్రామంలో ఆదివారం ఆర్ఎన్ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవితేజ మాట్లాడుతూ సుమారు వందమందికి పైగా బిపి, షుగర్, ఫైల్స్, కంటి పరీక్షలు నిర్వహించి గ్రామస్తులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పార్ధసారథి, హేమావతి, ల్యాబ్ కళ్యాణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.